**లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి**

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్: (040) 2475132,



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY

తెలుగు దినపత్రిక


## బిహార్ సీఎంగా సమ్రాట్ చౌధరీ ప్రమాణస్వీకారం

పట్నా:బిహార్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రానికి చెందిన సీనియర్ బీజేపీ నేత సమ్రాట్ చౌధరీ నూతన ముఖ్యమంత్రిగా బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. పట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన ఘన కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్ తోపాటు పలు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నాయకులు హాజరయ్యారు.రాజ్యసభకు ఎన్నికవ్వడంతో నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడం ద్వారా ఆ మార్పులకు నాంది పలికింది. దీంతో బిహార్‌లో తొలిసారిగా బీజేపీ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా మారింది. ఈ నేపథ్యంలో సమ్రాట్ చౌధరీ సీఎం పదవిని చేపట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.అయితే సమ్రాట్ చౌధరీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ముందు పట్నాలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత లోక్ భవన్‌కు చేరుకుని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఉపముఖ్యమంత్రులుగా జేడీయూ సీనియర్ నేతలు విజయ్ కె చౌధరి, బిజేంద్ర ప్రసాద్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కూటమి సమీకరణం బిహార్ రాజకీయాల్లో కొత్త సమతుల్యతను సూచిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.


నల్లగొండ | సంపుటి:16 | సంచిక:89 | ఎడిటర్: సయ్యద్ పాష | 16-04-2026 గురువారము | పేజీలు :8 | వెల:1/-


### ఖర్గే నివాసంలో ఇండియా కూటమి

# నేతలు భేటీ.. డీలిమిటేషన్‌పై చర్చ



న్యూఢిల్లీ: పార్లమెంటు ప్రత్యేక మూడు రోజుల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ల చట్టంపై అనుసరించాల్సిన వ్యూహాన్ని చర్చించేందుకు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఇండియా కూటమినేతలు సమావేశమయ్యారు. ఖర్గే తన నివాసంలో పార్టీ పార్లమెంటరీ వ్యూహ బృందం సమావేశాన్ని ఏర్పాటు చేయగా, ఈ భేటీలో కాంగ్రెస్ అగ్ర నాయకులు మహిళా రిజర్వేషన్ల అంశంతో పాటు నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కూడా చర్చించారు.మహిళా రిజర్వేషన్ల చట్టం, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం మంగళవారం ఎంపీలకు పంపిణీ చేసింది. ఏదైనా బిల్లు వెనుక ఉన్న ఉద్దేశం దురుద్దేశపూరితంగానూ, దానిలోని అంశాలు కుటిలమైనవిగానూ ఉన్నప్పుడు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి కలిగే నష్టం అపారంగా ఉంటుందని కాంగ్రెస్ ఆరోపించింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు పొడిగించబడ్డాయి. ఏప్రిల్ 16 నుండి 18 వరకు మూడు రోజుల పాటు సభ ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ సమావేశాల సందర్భంగా సాధారణంగా మహిళా రిజర్వేషన్ చట్టంగా పిలువబడే 'నారీ శక్తి వందన్ అధినియం'ను 2029లో అమలు చేసేందుకు అవసరమైన సవరణలు కేంద్ర ప్రవేశపెట్టనుంది. చివరగా ప్రచురించిన జనాభా లెక్కల ఆధారంగా చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అనంతరం, 2029 పార్లమెంటు ఎన్నికలకు ముందే మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలులోకి తీసుకురావడానికి, ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను 850 వరకు పెంచనున్నారు.పార్లమెంటు రాబోయే ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న రాజ్యాంగ సవరణ బిల్లు ముసాయిదా ప్రకారం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల శాసనసభల్లోని స్థానాలను కూడా పెంచనున్నారు. మహిళా రిజర్వేషన్ల, డీలిమిటేషన్ బిల్లుపై పలు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ బిల్లుల వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సీఎం స్టాలిన్ తో పాటు పలువురు నేతలు వ్యతిరేకిస్తుండగా, బీజేపీ నేతలు వారి వ్యాఖ్యలను తప్పుబడుతున్నారు.

### డీలిమిటేషన్‌పై అసత్య ప్రచారం



వరంగల్, : నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. ఇవాళ (బుధవారం) వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు.నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని రాంచందర్‌రావు స్పష్టం చేశారు. 'సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారు' అని ఆయన మండిపడ్డారు.సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమైనవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా , కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు.'నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలి.' అని రాంచందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన ప్రక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## రేవంత్ రెడ్డితో పీసీసీ చీఫ్, మీనాక్షి నటరాజన్ భేటీ



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల AICC ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ బుధవారం భేటీ అయ్యారు. పార్టీ వ్యవహారాలతో పాటు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించనున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ, పదవీకాలం ముగిసిన కార్పొరేషన్ ఛైర్మన్ల రెన్యూవల్, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై జిల్లాలో జరిగే భేటీలు, జీవన్ రెడ్డి పార్టీ మార్పుపై చర్చించనున్నారు. నామినేటెడ్ పదవులకు సంబంధించిన అంశాలు, ఎమ్మెల్యేల అసంతృప్తి, కొందరు మంత్రులపై ఇటీవల వచ్చిన ఆరోపణలతో సహా పార్టీ ప్రస్తుత పరిస్థితిపై ఈ చర్చలు సాగే అవకాశం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించి పార్టీ అనుసరించాల్సిన వ్యూహం కూడా ఈ సమావేశంలో ఒక కీలక అంశంగా చర్చకు వస్తుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం



నల్లగొండ: జనాభా ప్రకారం డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంది దీంతో ఉన్న సీట్లకు 50 శాతం పెంచేలా కేంద్రం కొత్త విధానం ప్రతిపాదించింది 50 శాతం జనాభా, 50 శాతం జీఎస్టీ పరంగా చేయాలని పలు రాష్ట్రాలు ప్రతిపాదిస్తున్నాయి.మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లు వేరువేరుగా పెట్టాలని పలు రాష్ట్రాలు కోరుతున్నాయి .జమిలీ ఎన్నికలు జరిగితే 18 రాష్ట్రాలు ఒకసారి, మిగిలిన రాష్ట్రాలు ఒకసారి ఎన్నికలకు వెళ్ళే అవకాశం ఉంది .తెలంగాణ లో వివిధ రాష్ట్రాల నుండి 20 లక్షల మంది కూలీలు వచ్చి ఉపాధి పొందుతున్నారు డబ్బు ప్రవాహాన్ని కట్టడి చేస్తే తప్ప భవిష్యత్ రాజకీయాల్లో సామాన్యుడు పోటీ చేసే పరిస్తితి లేదు.అధికార పార్టీలో అసంతృప్తి సాధారణం బిఆర్ఎస్ ను టిఆర్ఎస్ గా మారుస్తారని ప్రచారం నడుస్తుంది.టిఆర్ఎస్ బిఆర్ఎస్ గా ఎందుకు మార్చారో ఆత్మ విమర్శ చేసుకోవాలి ధాన్యం కొనుగోళ్ల సమస్య క్లియర్ అయిందిసన్నధాన్యం సేకరణ లో ఎక్కడా సమస్య లేదు సీఎంఆర్ ధాన్యం సేకరణ లో పూర్తి స్థాయి నియంత్రణ ఉండాలి మిల్లులను క్లోజ్ చేయించే పరిస్థితి లేదుమిల్లులు బంద్ అయితే ధాన్యం కొనుగోలు చేసేవారు ఉండరు కేంద్రం 20 శాతం బాయిల్డ్ రైస్, 80 శాతం రా రైస్ ఇవ్వాలని అడుగుతుందికానీ మిల్లర్లు బాయిల్డ్ రైస్ కు ప్రాధాన్యత ఇస్తున్నారు.వేసవి లో రా రైస్ సేకరిస్తే నూక ఎక్కువగా ఉంటుంది.ఏఎమ్మార్పీ 4000 క్యూసెక్కుల నీరు సాగాలి .కానీ ప్రస్తుతం 2400 క్యూసెక్కులకు మించి నీరు ప్రవహించే పరిస్తితి లేదు సాగునీటి కాలువలను విస్తరించడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది లైనింగ్ కు ముందే కాలువలు విస్తరణ చేపట్టాలి..

## ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలి



దేవరకొండ, : దేవరకొండ మండలంలోని కొండభీమనపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు మధ్యవర్తుల చేతిలో నష్ట పోకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను విక్రయించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడం ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, రైతుల సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

# గ్రామీణ అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యం



కల్లూరు,: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాల పెంపు లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు మండలంలో పర్యటించారు. ముందుగా కల్లూరు మండలంలో నారాయణపురం గ్రామంలో 2 కోట్ల 75 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి శంకుస్థాపన చేసి, 10 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన వైద్య విధాన పరిషత్‌కు చెందిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన విద్యుత్, వైద్య సేవలు, మౌళిక సదుపాయాలు అందించడమే లక్ష్యమని అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.కల్లూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా కల్లూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల పరిసర పలు గ్రామాలకు చెందిన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతోనే ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళుతున్నదని తెలిపారు. 33/11 కేవి విద్యుత్ ఉపకేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు నిరంతర విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని, విద్యుత్, ఆరోగ్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, వైద్యాధికారులు, విద్యుత్ శాఖ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## పోలీసులను ఆశ్రయించిన ఐటీఎస్ మహిళా డైరెక్టర్

హైదరాబాద్, : బంజారాహిల్స్ పోలీసులను ఇండియన్ టెలికాం సర్వీస్ మహిళా డైరెక్టర్ ఆశ్రయించారు. తన ఇంటి మీదకు వచ్చి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న సుతాన్ ఎస్పీ అనే వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. ఐఏఎస్-ఐపీఎస్ క్వార్టర్స్‌లో బాధితురాలు ఒంటరిగా నివసిస్తున్నారు. సుతాన్ ఎస్పీ తన ఇంటి వద్దకు వచ్చి అభ్యంతరకరంగా మాట్లాడుతున్నాడని, అసభ్యంగా సిగ్నల్స్ చేస్తున్నాడని బాధితురాలు ఆరోపించారు.ఈ సంఘటనలకు సంబంధించిన వీడియోలను ఆధారాలుగా ఫిర్యాదులో జత పరిచారు టెలికాం డైరెక్టర్. ఇంటి ముందు సుతాన్ ఎస్పీ న్యూసెన్స్ క్రియేట్ చేసి నానా హంగామా చేశాడని బాధితురాలు ఆరోపించారు. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో స్కూల్ కిట్ల పంపిణీ

దామరచర్ల, : యూత్ ఫర్ సేవా నల్లగొండ చాప్టర్ ఆధ్వర్యంలో దామరచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్కూల్ కిట్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, ఒక సంవత్సరానికి సరిపడా నోట్ బుక్స్, అభ్యాసన సామగ్రిని అందించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బి.సీతామహాలక్ష్మి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడానికి ఇష్టంతో కష్టపడి చదువుకోవాలని, యూత్ ఫర్ సేవ ద్వారా ఇచ్చిన బ్యాగ్, పుస్తకాలని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని చెప్పారు.అనంతరం పాఠశాల హెడ్ మాస్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి సొంత గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. యూత్ ఫర్ సేవ నల్లగొండ జిల్లా కోఆర్డినేటర్ నాగేంద్ర చారి మాట్లాడుతూ.. వచ్చే సంవత్సరం నుండి ల్యాబ్ ఆన్ వీల్స్ ద్వారా ప్రతి వారం సైన్స్ తరగతుల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తామన్నారు. యూత్ ఫర్ సేవా భారతదేశం అంతటా విద్యా , వైద్యం, నైపుణ్య శిక్షణ, పర్యావరణ అంశాలపై నిర్వహిస్తున్న వివిధ సేవ కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు.

## కిషన్ రెడ్డి అహంకారపూరిత మాటలను ఖండిస్తున్నాం



న్యూఢిల్లీ, : సీఎం రేవంత్ రెడ్డిపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఎంపీ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. సీఎంను నోరుమూసుకుని కూర్చోమంటారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అహంకారపూరిత మాటలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం అంటే కిషన్ రెడ్డికి విలువ లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. మహిళా రిజర్వేషన్‌తో పాటు బీసీలకు కూడా రిజర్వేషన్ పెట్టాలని ఎంపీ డిమాండ్ చేశారు.భారతదేశం ఐక్యంగా ఉండాలని ఇద్దరు కాంగ్రెస్ ప్రధాన మంత్రులు ప్రాణత్యాగం చేశారని ఎంపీ గుర్తుచేశారు. భారతదేశం పట్ల కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత ఉందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా డీలిమిటేషన్ చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఎంపీ హెచ్చరించారు. పార్లమెంట్‌లో తమ గళం వినిపిస్తామన్నారు. ఇలానే జరిగితే తెలంగాణ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదం పొందాలంటే టూ థర్డ్ మెజారిటీ కావాలని ఎంపీ మల్లు రవి వెల్లడించారు.

# దేశ టైమ్స్

## సంపాదకీయం

### ఎండైనా, వానైనా, రాత్రైనా ప్రమాదకరమైన పరిస్థితుల్లో విద్యుత్ స్తంభాలెక్కి పని చేయడం చిన్న విషయం కాదు...

'ఎగిరెగిరి దంచినోడికి అదే కూలి.. ఎగరకుండా దంచినోడికి అదే కూలి' అన్నట్లు ఎసిలో కూర్చునోళ్లకు అదే కూలి. ఎండనక, వాననకా, రాత్రనక, పగలనక కరెంటు కోసం చెట్లు పుట్టలు ఎక్కెటోళ్లకు అదే కూలి, కాదు అంతకన్నా తక్కువ కూలీ అదేంది అనుకుంటున్నారా ఇది నిజం. కింద కూసోని పని చెప్పేటోళ్లకు పైసలెక్కువ, అదే కరెంటు స్తంభాలెక్కి పనిచేసే కార్మికులకు తక్కువ జీతం, ఎక్కువ శ్రమ, గ్యారెంటీలేని జీవితం ఎప్పుడు ఏమవుతుందో అర్థంకాని పరిస్థితి ఇన్ని ఇబ్బందులను తట్టుకొని కూడా శ్రమిస్తున్నారంటే నిజానికి కరెంటు కార్మికులకు మనం సెల్యూట్ చేయాల్సిన అవసరం ఉంది. ఒక పది నిమిషాలు కరెంటు పోతే మనం అల్లాడిపోతం, అంతేకాదు మనం 12 గంటలు డ్యూటీ చేస్తేనే అయోమయం అయిపోతాం. మరి అలాంటిది కరెంటు కార్మికుల పరిస్థితి ఎప్పుడైనా చూశారా? మన దేశంలో ఎక్కువ కష్టపడేది ఎవరంటే మొదటగా సైనికులు, ఆ తర్వాత పోలీసులు, కరెంటు కార్మికులు కూడా అత్యధికంగా శ్రమించేవారే. ఇందులో ఎలాంటి సందేహం లేదు.ఎండైనా, వానైనా, రాత్రైనా ప్రమాదకరమైన పరిస్థితుల్లో విద్యుత్ స్తంభాలెక్కి పని చేయడం చిన్న విషయం కాదు. ఒక్క చిన్న తప్పిదం జరిగినా ప్రాణానికి ముప్పు. అయినా కూడా వాళ్లు పనిచేస్తూనే ఉంటారు, ఎందుకంటే సమాజం నడవడానికి వాళ్ళు చేయడం ఎంతో అవసరం లేదంటే అంత చీకటిమయం. మరి అంత శ్రమించేవారికి జీతం ఎందుకు తక్కువ అనుకుంటున్నారా అదే మరి సమస్య ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది. 'ఒక గుడ్డివాడికి చూపు రాగానే మొట్టమొదట విసిరేసేది అప్పటివరకు సహాయపడిన చేతికర్రనే' అన్నట్లు ఓడిపోయినా నాయకులకు, గెలిచినా నాయకులకు కరెంటు కార్మికులు చేతికర్రలాంటోళ్ళు వాళ్ళకి పదవి రాగానే కరెంటు కార్మికులను కంటికి కనపడకుండా తిరుగుతారు. అప్పటిదాకా మేము ఉన్నాం మీకు అది చేస్తాం ఇది చేస్తాం అన్నోళ్లే ఆఖరికి ఏమి చేయలేని పరిస్థితి. ఈ కార్మికుల కష్టాలు ఎవరికీ చెప్పుకోవాలో అర్థంకాక కకావికలం అవుతున్నారు.కెసిఆర్ ప్రభుత్వం పర్మినెంట్ చేస్తాం అనగానే కార్మికులకు ఇక మాకు మంచిరోజులు వచ్చినాయి అనుకుండ్రు. తీరా చూస్తే మళ్ళీ మొదటికి వచ్చింది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు శాశ్వత హోదా కల్పించమని ఏండ్లతరబడి మొత్తుకున్నా ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఇగ చేస్తాం అగ చేస్తాం అని చెప్పుడే తప్ప చేసింది ఏమీలేదు. గత 18 ఏళ్లకు పైగా తెలంగాణ విద్యుత్ రంగంలో కాంట్రాక్ట్ కార్మికులుగా సేవలందిస్తున్నవారు అప్పటి తెలంగాణ ఉద్యమ సమయంలో, వీరి సేవలను క్రమబద్ధీకరిస్తామని అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇచ్చారు. ఆ హామీ నెరవేరకపోవడంతో, 2016లో విద్యుత్ కార్మిక సంఘాలతో కలిసి నిరసన తెలిపారు. నిరసన కారణంగా జులై 28, 2017న పారిశ్రామిక వివాదాల చట్టం, 1947లోని సెక్షన్ 12(3) ప్రకారం ఒప్పందం కుదిరింది. జులై 29, 2017న సంస్థలో విలీనం చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.ఇంతవరకు చూస్తే సమస్య పరిష్కారం దిశగా వెళ్లినట్టే కనిపించింది. అయితే, 'మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు' కొందరు నిరుద్యోగ యువకులు దీనిని హైకోర్టులో సవాలు చేసి నీరుగార్చేలా చేశారు. సెప్టెంబర్ 18, 2018న హైకోర్టు కార్మికులకు అనుకూలంగా తీర్పునిస్తూ, సెక్షన్ 12(3) ప్రకారం ఈ సమస్యలను పరిష్కరించుకునే అధికారం విద్యుత్ సంస్థలకు, రాష్ట్ర ప్రభుత్వానికి, కార్మిక సంఘలకు ఉందని స్పష్టం చేసింది. అప్పటి సిఎం అసెంబ్లీలో, గవర్నర్ ప్రసంగం ద్వారా 23,667 మంది కార్మికులను క్రమబద్ధీకరించినట్లు ప్రకటించారు. కానీ కార్మికుల రెగ్యులరైజేషన్ అనే ప్రక్రియ అనేక మలుపులు తిరుగుతూ కార్మికులకు పూర్తిస్థాయి క్రమబద్ధీకరణకు బదులుగా, పాత ఉత్తర్వులను రద్దు చేసి, ఫ్యాక్టరీల చట్టం 1946 స్టాండింగ్ ఆర్డర్స్ సర్వీస్ రూల్స్‌ను ప్రవేశపెట్టింది. దీనివల్ల అధికారికంగా శాశ్వత హోదా లేకుండానే కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారు. 'చెప్పుకొని మురువుచూసుకొని ఏడువు' అన్నట్లు వీరు సమాజం దృష్టిలో శాశ్వత ఉద్యోగులే కానీ, ప్రభుత్వ దృష్టిలో మాత్రం కాదు.చెప్పుకోవడానికి కరెంటు ఉద్యోగం కానీ వీరి జీవితం కన్నీళ్లు కష్టాలే. జీతం పెంచుడు దేవుడెరుగు కానీ మా కష్టాలను చూసైనా కనికరించండయ్యా మహా ప్రభో అని వేడుకున్న వినే నాయకులు లేరు. ఇక పని విషయానికి వస్తే.. ఎంత చెప్పుకున్నా వీరి కష్టాలు తక్కువగానే అనిపిస్తాయి. ఇతర ప్రభుత్వ ఆఫీసుల్లో ఒకరి పని నలుగురు చేస్తుంటే, కరెంట్ ఆఫీసుల్లో మాత్రం ఐదుగురు చేయాల్సిన పనిని ఇద్దరు ముగ్గురే మోస్తున్నారు. సమాన అవకాశాలు లేకపోవడమే కాదు.. గత రెండు సంవత్సరాలుగా రెగ్యులర్ అయిన వాళ్లకి, రెగ్యులర్ కాని వాళ్లకి 30% నుంచి 60% వరకు జీతాల్లో తేడా ఉంది. సాధారణంగా ఏడాదికి 300 షిఫ్టులు ఉండాలి.. కానీ వీరు 450 షిఫ్టులు చేస్తున్నారు. వారానికి సెలవులు కూడా లేకుండా, నిరంతరం పని ఒత్తిడిలోనే బతుకుతున్నారు. ఈ ఒత్తిడి ఎంతలా ఉందంటే.. తమ కుటుంబ సభ్యుల చివరి చూపుకి కూడా వెళ్లలేని పరిస్థితి.. అంత్యక్రియలకు హాజరు కాలేని బాధ.. మాటల్లో చెప్పలేం. ఇంకా దురదృష్టకరమైన విషయం ఏమిటంటే.. ఆర్టిసన్ కార్మికులకి ఎలాంటి సర్వీస్ బెనిఫిట్స్ లేవు.. గ్రాట్యుటీ అనే హక్కు కూడా లేదు. దాంతో రిటైర్ అయ్యాక కూడా బతుకుదెరువు కోసం మళ్లీ వృద్ధాప్యంలో అడ్డా కూలీలాగా తిరగాల్సిన పరిస్థితి నిబంధనల ప్రకారం గ్రేడ్ మార్చితే ప్రభుత్వానికి నెలకు 10 కోట్ల రూపాయల భారం పడుతుందని చెప్తున్నారు.కానీ మేమేమీ అదనంగా అడగడం లేదు సార్.. ఇప్పుడు తీసుకుంటున్న జీతాలకే (కరెంట్ పే స్కేల్‌కి) మమ్మల్ని రెగ్యులర్ పోస్టుల్లోకి తీసుకోండి అనేదే మా విజ్ఞప్తి. ప్రభుత్వంపై భారం లేకుండా, మా బతుకుల్ని గాడిలో పెట్టాలనే మా కోరిక మాత్రమే.. అంతే అని అంతలా వేడుకున్నా కూడా ప్రభుత్వం కరుణించకపోవడం.. ఇది మాత్రం కరెంట్ కార్మికుల దౌర్భాగ్యమే అనాలి. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే.. విధి నిర్వహణలోనే ఎంతోమంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. మా ఆర్టిసన్ కార్మికుల్లో దీ.ఎవష్ట్ర, డిప్లొమా, పిజిలు చేసినవాళ్లు కూడా ఉన్నారు. అయినా సరే వారికి సరైన కేడర్ లేకుండా, గౌరవం లేకుండా పని చేస్తున్నారు. వారిని కూడా గౌరవించి, సమాలోచన చేసి, తగిన చర్యలు తీసుకోవాలని, కనీసం మాకు ప్రభుత్వం పాత సర్వీస్ రూల్స్ అమలు చేసి, మా జీవితాల్లో వెలుగులు నింపండని ముక్తకంఠంతో ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## దివ్యాంగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త

హైద్రాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీ కార్యాచరణను ప్రకటించింది. పింఛన్ల విస్తరణతో పాటు అత్యాధునిక పరికరాల పంపిణీకి శ్రీకారం చుట్టడం ద్వారా వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపేందుకు సిద్ధమైంది.రాష్ట్రంలో అర్హులైన ప్రతి దివ్యాంగుడికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తాజాగా మరో లక్ష మంది దివ్యాంగులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు దివ్యాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ వీరయ్య వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా ప్రస్తుతం వేచి చూస్తున్న వేలాది మందికి ఆర్థిక భరోసా లభించనుంది. ఇప్పటికే ఉన్న పింఛన్ల వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తూ, కొత్త లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు.దివ్యాంగుల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం కేవలం ఆర్థిక సాయానికే పరిమితం కాకుండా, భౌతిక అవసరాలను తీర్చేందుకు ప్రాధాన్యతనిస్తోంది. 40 శాతం మరియు అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి వారు సులభంగా తిరగడానికి, పనులు చేసుకోవడానికి అవసరమైన అడ్వాన్స్ పరికరాలను (ూాఎఝుఅఎేవఎ జునబఱఱజూఎవత్) ఉచితంగా అందజేయనున్నారు. ఇందులో స్మార్ట్ కేన్స్, అత్యాధునిక శ్రవణ యంత్రాలు మరియు వీల్ చైర్స్ వంటివి ఉండనున్నాయి. ఈ పరికరాల ద్వారా దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా తమ పనులు తామే చేసుకునే వెసులుబాటు కలుగుతుంది.దివ్యాంగుల సాధికారతలో భాగంగా ఇప్పటికే అమలు చేసిన పథకాల వివరాలను ఛైర్మన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తొలి విడతలో భాగంగా సుమారు 4,500 ఇందిరమ్మ ఇళ్లను దివ్యాంగుల కోటాలో కేటాయించగా, వారి రవాణా సౌకర్యం కోసం 2,000 స్కూటీలను ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. గూడు మరియు నీడ కల్పించడంతో పాటు ఆర్థికంగా, సామాజికంగా దివ్యాంగులు ఎదిగేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

## రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణం

కరీంనగర్ : రోడ్డు ప్రమాదాలకు మానవ తప్పిదాలే ముఖ్య కారణమని కరీంనగర్ పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా, కరీంనగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్, రవాణా శాఖ సమన్వయంతో స్థానిక కొత్తపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని రేకుర్తి చౌరస్తాలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం, డ్రంకెన్‌డ్రైవ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, అపసవ్య మార్గాల్లో ప్రయాణించడం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం ప్రమాదాలకు ముఖ్య కారణాలుగా తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి, ఇన్‌స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్, సంజీవ్, కుమారస్వామి, కార్పొరేటర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్ధుంపూర్, నగునూర్ గ్రామాలలో కరీంనగర్ రూరల్ పోలీసులు రోడ్డుప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఏ నిరంజన్‌రెడ్డి, ఎస్ఐలు నరేష్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

చౌటుప్పల్, : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ తెలిపారు. పట్టణంలోని మల్లికార్జున ఒలంపియాడ్ స్కూల్ లో గ్రాడ్యువేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పావని రమేష్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి బావి భారతం పౌరులని, చిన్నతనం నుండే పట్టుదలతో కృషి చేస్తే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అందుకుంటారని, చిన్నపిల్లలకు క్రమశిక్షణ, ఉన్నత విలువలతో కూడిన విద్యని అందించడం ద్వారా సమాజంలో ఉన్నత పదవులలో ఉండి సమాజానికి సేవ చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, ఎంఈఓ గురువారావు, మల్లికార్జున హైస్కూల్ చైర్మన్ మారపల్లి మల్లారెడ్డి, డైరెక్టర్లు భీమిడి ధరణి, మారెపల్లి తేజస్విని, ప్రిన్సిపాల్ కన్నయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఊడుతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు



ప్రపంచవ్యాప్తంగా 2026 ప్రారంభం నుంచే టెక్ రంగంలో ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం కనిపిస్తోంది. ఈ రంగంలో ఇప్పటికే దాదాపు 80వేల ఉద్యోగాలు కోల్పోయినట్టు పలు నివేదికలు చెప్తున్నాయి. ఇందులో అమెరికా నుంచే అత్యధికంగా 76 శాతం కోతలు ఉన్నాయి. అయితే ఈ ఉద్యోగ కోతలకు ప్రధాన కారణంగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత మార్పులు నిలుస్తున్నాయి.ఈ ఏడాది ప్రారంభం నుంచే టెక్నాలజీ రంగంలో ఉద్యోగుల పరిస్థితి కఠినంగా మారుతోంది. నిక్కై ఏసియా నివేదిక ఇదే విషయాన్ని చెప్తోంది. ఈ నివేదిక సమాచారం ప్రకారం... ఈ ఏడాది జనవరి 1 నుంచి ఏప్రిల్ 1 వరకు ప్రపంచవ్యాప్తంగా 78,557 మంది టెక్ ఉద్యోగులు తమ ఉద్యోగాలు కోల్పోయారు. ఇందులో అమెరికా ఒక్కటే సుమారు 76.7 శాతం వాటా కలిగి ఉంది. అమెజాన్, ఒరాకిల్, మెటా, డెల్ వంటి ప్రముక కంపెనీలు ఈ ఉద్యోగ కోతలను 'పునర్వ్యవస్థీకరణ (రీకన్‌స్ట్రక్టింగ్)', వ్యూహ మార్పులలో భాగంగా వివరిస్తున్నప్పటికీ.. ఈ మార్పుల వెనుక ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ మొత్తం ఉద్యోగ కోతల్లో దాదాపు 37,638 ఉద్యోగాలు నేరుగా లేదా పరోక్షంగా ఏఐ ఆటోమేషన్ వల్ల జరిగాయని అంచనా. సంస్థలు తమ కార్యకలాపాల్లో ఏఐని విస్తృతంగా ఉపయోగించడం ప్రారంభించాయి. దీనితో పనితీరు మెరుగుపడుతుందని భావించి, కొన్ని ఉద్యోగాల అవసరం తగ్గుతోంది.కాగ్నిజెంట్ సంస్థ చీఫ్ ఏఐ ఆఫీసర్ బాబక్ హౌడ్జత్ ప్రకారం.. ఏఐ ప్రభావం ఇంకా పూర్తిగా బయటపడలేదు. కంపెనీలు ఏఐ వల్ల వచ్చే ప్రయోజనాలను ఇంకా పూర్తిగా అనుభవించలేదు. ప్రస్తుతం జరుగుతోన్న ఉద్యోగ కోతలు.. ఏఐ నిజంగా సాధించిన ఫలితాల కంటే భవిష్యత్తులో అది సాధిస్తుందనే అంచనాల ఆధారంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఇక కొన్ని సంస్థలు కోవిడ్ తర్వాత అధికంగా నియామకాలు చేసిన కారణంగా కూడా ఉద్యోగులను తగ్గిస్తున్నాయి. అయితే ఈ కోతలకు ఏఐను ఒక కారణంగా చూపుతున్నట్టు కూడా ఆయన వివరించారు. టెక్ రంగంలో ఈ మార్పుపై నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏఐ ఆధారిత వ్యవస్థలకు మారుతున్న సమయంలో సంస్థలు, ఉద్యోగులు రెండూ కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అంటున్నారు. ఈ మార్పు కాలాన్ని 'పెయిన్‌ఫుల్ ట్రాన్సిషన్'గా బాబక్ హౌడ్జత్ అభివర్ణించారు.ఇక గోల్డ్‌మన్ సచ్స్ నివేదిక ప్రకారం.. వచ్చే పదేండ్లలో ఏఐ కారణంగా అమెరికాలో 6-7 శాతం ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది నిరుద్యోగాన్ని సుమారు 0.5 శాతం వరకు పెంచవచ్చు. ఏఐ వల్ల ఉద్యోగాలు కోల్పోయినవారికి దీర్ఘకాలిక ఆర్థిక ప్రభావం కూడా ఉంటుంది. వారి ఆదాయం సుమారు 3 శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. అలాగే పదేండ్లలో వారి ఆదాయ వృద్ధి సుమారు పది శాతం వరకు వెనుకబడే ప్రమాదం కనబడుతోంది. ప్రత్యేకించి జెన్-జెడ్ ఉద్యోగులు తక్కువ నైపుణ్యం ఉన్న పనుల్లోకి మారే అవకాశం ఉండటంతో.. వారి కెరీర్ పురోగతి నెమ్మదించవచ్చు. దీంతో జీవితంలో ముఖ్యమైన నిర్ణయాలు ఆలస్యమయ్యే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఏఐ ఆధారిత మార్పులు టెక్ ఉద్యోగులను వణికిస్తూ ఆందోళన కలిగిస్తున్నయి. ప్రస్తుతం కనిపిస్తున్న ఉద్యోగ కోతలు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగులు కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం అత్యంత కీలకంగా మారిందని వివరిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం!




కల్వకుర్తి : జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు అరైవ్ అలైవ్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక భాగంగా నిర్వహిస్తోన్న అరైవ్ - అలైవ్ కార్యక్రమాన్ని కల్వకుర్తి మండలం తర్మికల్ గ్రామపంచాయతీలో నిర్వహించారు.ప్రజలభాగస్వా మ్యంతోనే రోడ్డు భద్రత సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. గ్రామ స ర్పంచ్ వరలక్ష్మి స్వంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. గ్రామ భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. నేటి నుండి ఈ నెల 18 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజల భద్రత, సంక్షేమమే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామ స్థాయిలో సర్పంచులు, యువత, అధికారులు కలిసి రోడ్డు ప్రమాదాల నియంత్రణలో చురుకైన పాత్ర పోషించాలన్నారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల జరుగుతున్న ప్రమాదాలు కుటుంబాలను ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు.పాదచారులు కూడా జాగ్రత్తగా రోడ్లు దాటాలని, నిర్దేశిత జీబ్రా క్రాసింగ్లను వినియోగించాలని చెప్పారు. గుడుం బా, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. రోడ్డు భద్రతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించే గోడపత్రికను ఆవిష్కరించారు. అదనపు ఎస్పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... జి ల్లా పోలీస్ శాఖ నుండి ప్రమాదాల నివారణపై అరైవ్ అలైవ్ కార్యక్రమాలతో ప్రతిరో జు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీవో చిన్న బాలు, గ్రామ సర్పంచి వరలక్ష్మి, కల్వకుర్తి , డీఎస్పీ వెంకట్ రెడ్డి తాహసిల్దార్ ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి



గరిడేపల్లి,: రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని గరిడేపల్లి ఎస్ఐ చలికంటి నరేష్ అన్నారు. మండలంలోని కీతవారిగూడెంలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు బాటలో నడవకుండా మంచి మార్గంలో నడిచి అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరారు.యువ కులందరూ ఐక్యమత్యంతో నడుచుకోవాలన్నారు.. ప్రస్తుతం విపరీతంగా పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై యువత అవగాహన పెంచుకోవడమే కాకుండా ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లేపల్లి రామనాథం, పిడమర్తి అంజి, అంబేద్కర్ యూత్ సభ్యులు అమరారపు శివాజీ, కడప అనిల్, బండారు వేణు, అమరారపు భరత్, బండారి విజయ్, గురవయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# స్పిరిట్ ఊచకోతకు 'అనంత' ఎలివేషన్స్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కలయికలో రాబోతున్న 'స్పిరిట్' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. 'యానిమల్' వంటి భారీ విజయం తర్వాత వంగా చేస్తున్న ప్రాజెక్ట్ కావడంతో, ప్రభాస్ ను ఆయన ఎలా ప్రెజెంట్ చేస్తారనే క్యూరియాసిటీ అందరిలోనూ ఉంది. ఈ సినిమాలో ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా కనిపిస్తారని ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. ఈ చిత్రానికి సంబంధించి పాటల రచయిత అనంత శ్రీరామ్ ఇచ్చిన లీక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.?సినిమా అంటే కేవలం యాక్షన్ మాత్రమే కాదు, అందులో బలమైన ఎమోషన్ కూడా ఉండాలని నమ్మే వ్యక్తి సందీప్ వంగా. 'స్పిరిట్' కోసం అనంత శ్రీరామ్ ఇప్పటికే రెండు పాటలను పూర్తి చేశారట. ఈ సినిమా ఆల్బమ్ ఒక క్లాసిక్ లా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రభాస్ ను క్లాసిక్ యాంగిల్ లో చూడటం కొంచెం కొత్తగా అనిపించినా, కథలోని సందర్భాలు దానికి తగ్గట్టుగా కుదిరాయని ఆయన వెల్లడించారు. క్లాసిక్ సాంగ్స్ తో పాటు సినిమాలో మాస్ ఆడియన్స్ ఆశించే అసలైన ఊచకోత కూడా ఉంటుందని హింట్ ఇచ్చారు.?సందీప్ వంగా సినిమాల్లో హీరో క్యారెక్టరైజేషన్ చాలా ఇంటెన్స్ గా ఉంటుంది. 'స్పిరిట్' లో ప్రభాస్ బాడీ లాంగ్వేజ్, పోలీస్ ఆఫీసర్ గా ఆయన చేసే యాక్షన్ సీక్వెన్స్ లు ఇప్పటివరకు వచ్చిన పోలీస్ సినిమాలకు భిన్నంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. గతంలో ప్రభాస్ చేసిన యాక్షన్ సినిమాల కంటే ఇందులో ఆవేశం కొంచెం ఎక్కువగానే ఉండొచ్చని అనంత శ్రీరామ్ మాటలను బట్టి అర్థమవుతోంది. కేవలం తన మార్క్ యాక్షన్ తోనే కాకుండా, క్లాసిక్ మ్యూజిక్ తో కూడా ప్రేక్షకులను సర్ప్రైజ్ చేయడానికి వంగా పక్కా ప్లాన్ తో ఉన్నారు. ఈ సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్ అందిస్తున్నాడు.?ఇక సినిమా షూటింగ్ ఇప్పటికే ఒక షెడ్యూల్ పూర్తి చేసుకుని, తదుపరి భారీ షెడ్యూల్ కోసం సిద్ధమవుతోంది. ప్రభాస్ కూడా తన లుక్ కోసం ప్రత్యేకంగా కష్టపడుతున్నారు. సందీప్ వంగా సినిమాల్లో విజువల్స్ చాలా నేచురల్ గా, 'రా'గా ఉంటాయి. 'స్పిరిట్' లో కూడా అదే స్టైల్ ను ఫాలో అవుతూ, సినిమాను గ్లోబల్ స్టాండర్డ్స్ లో రూపొందిస్తున్నారు.?సాధారణంగా పోలీస్ సినిమాలు అంటే కొన్ని రొటీన్ సన్నివేశాలు ఉంటాయి. కానీ వంగా మార్క్ పోలీస్ ఎలా ఉంటాడో ఇప్పటికే ఫ్యాన్స్ ఊహించుకుంటున్నారు. "మీరు కోరుకున్నంత ఊచకోత సినిమాలో ఉంటుంది" అని అనంత శ్రీరామ్ చెప్పడం చూస్తుంటే, ప్రభాస్ లోని అగ్రెసివ్ యాంగిల్ ను వంగా పూర్తిస్థాయిలో వాడుకున్నట్లు కనిపిస్తోంది. యాక్షన్ బ్లాక్స్ లో వైలెన్స్ లెవెల్స్ 'యానిమల్' కంటే ఒక రేంజ్ లో ఉంటాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# రిపేర్లు సరే ముందు డ్యామేజ్ చూడండి



ఎంత పెద్ద స్టార్ హీరో నటించిన సినిమా అయినా సరైన రీతిలో ప్రేక్షకులకు దానిని చేరవేయడం చాలా అవసరం. కానీ విశ్వంభర ఇవేవీ పట్టనట్టు ప్రవర్తిస్తోంది. గత ఏడాది సంక్రాంతికి రావాల్సిన ఈ ప్యాన్ ఇండియా మూవీ వాయిదా పడి పదిహేను నెలలు గడుస్తున్నా ఎలాంటి అప్డేట్ ఇవ్వడం లేదు. హనుమాన్ జయంతికి పోస్టర్ రాలేదు. అంతకు ముందు శ్రీరామనవమిని వదిలేశారు. దానికి మునుపు ఉగాదికి ఏమైనా గుడ్ న్యూస్ చెబుతారనుకుంటే అదీ నెరవేరలేదు. పుణ్యకాలం కాస్తా గడిచిపోతోంది.పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లుకి జరిగిన పొరపాట్లు విశ్వంభరకు రిపీట్ కాకూడదనేది మెగా ఫ్యాన్స్ కోరిక. విపరీతమైన జాప్యం వల్ల ఇలాంటి ప్రాజెక్టులకు క్రమంగా హైప్ తగ్గిపోతుంది. ఇన్ని సంవత్సరాలు తీశారనే సానుభూతి కన్నా అంత బాగా రాలేదు కాబట్టే లేట్ చేస్తున్నారన్న అభిప్రాయం కలిగే ప్రమాదముంది. మన శంకరవరప్రసాద్ రూపంలో బ్లాక్ బస్టర్ చిరంజీవి కొట్టిన తర్వాత కూడా విశ్వంభర ఆ అడ్వాంటేజ్ వాడుకోకపోవడం ముమ్మాటికీ అనుమానాలకు తావిచ్చేదే.ముందైతే క్రమం తప్పకుండా సోషల్ మీడియాలో ఎంతో కొంత సౌండ్ వచ్చేలా చేయాలి. లీక్స్ ఇచ్చినా పర్లేదు లేదా అఫీషియల్ గా వదిలినా పర్లేదు ఏదో ఒక కంటెంట్ ఇస్తే దాని గురించి జనం మాట్లాడుకుంటారు. 2025 చిరంజీవి బర్త్ డే రిలీజ్ చేసిన టీజర్ తర్వాత మళ్ళీ ఎలాంటి సౌండ్ లేదు. ఈలోగా యువి క్రియేషన్స్ కు ఘాటీ రూపంలో ఒక డిజాస్టర్ పడింది. కమర్షియల్ గా బైకర్ ఎంతవరకు సేఫ్ అయ్యిందనేది ఇంకా తేలాల్సి ఉంది కాబట్టి వేచి చూడాలి.వీఎఫ్ఎక్స్ రిపేర్ల వల్ల ఇంత టైం తీసుకోవడం ఓకే కానీ ఓవర్ డిలే చేయడం కూడా కరెక్ట్ కాదు. ఆల్రెడీ సమ్మర్ స్లాట్స్ అయిపోతున్నాయి. స్వయంభు, పెద్ది, ప్యారడైజ్, నాగబంధం, భోగి లాంటి పెద్ద బడ్జెట్ సినిమాలు డేట్లు వేసుకుని రెడీగా ఉన్నాయి. ఇవన్నీ విశ్వంభర కన్నా చాలా ఆలస్యంగా మొదలైనవి. కానీ విడుదల విషయంలో క్లారిటీతో ఉన్నాయి. ఎటొచ్చి విశ్వంభర మాత్రం ఎక్కాల్సిన రైలు జీవిత కాలం లేటు తరహాలో మీనమేషాలు లెక్కబెడుతూనే ఉంది.

# కూతురిని చంపి తల్లి ఆత్మహత్య !

హైద్రాబాద్: నగరంలోని వైట్‌ఫీల్డ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇమ్మెడిహళ్లిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించడం కలకలం రేపింది. సువర్ణ (40) అనే మహిళ తన 14 ఏళ్ల కుమార్తె కారుణ్యను కిరాతకంగా హతమార్చి, అనంతరం తాను కూడా ఉరేసుకుని ప్రాణాలు తీసుకుంది. వెలుగులోకి వచ్చిన ఈ ఘటన ఆ ప్రాంతంలో విషాద ఛాయలు నింపింది.సువర్ణ భర్త చంద్రశేఖర్ ఉదయం తన పని నిమిత్తం బయటకు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో భార్యకు ఫోన్ చేయగా స్పందన లేకపోవడంతో, ఆయనకు అనుమానం వచ్చి తన సోదరుడిని ఇంటికి పంపించారు. ఉదయం 11 గంటల సమయంలో ఆయన సోదరుడు వెళ్లి చూడగా, ఒక గదిలో బాలిక కారుణ్య విగతజీవిగా పడి ఉండగా, సువర్ణ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. తక్షణమే పోలీసులకు సమాచారం అందించడంతో, వైట్‌ఫీల్డ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు.ప్రాథమిక విచారణ ప్రకారం, సువర్ణ తన కుమార్తెను ఊపిరాడకుండా చేసి చంపిన తర్వాతే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దారుణానికి ఆర్థిక సమస్యలే కారణమని మృతురాలి సోదరి ఉష వ్యక్తం చేసిన అభిప్రాయాలు బలాన్ని చేకూరుస్తున్నాయి. కుటుంబ నిర్వహణ కష్టంగా మారిందని, ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయని సువర్ణ గత కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు గురైనట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు ప్రస్తుతం రెండు వేర్వేరు ఫిర్యాదులను నమోదు చేశారు. తన భార్యే కుమార్తెను హత్య చేసిందని భర్త చంద్రశేఖర్ ఫిర్యాదు చేయగా, సువర్ణ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఆమె సోదరుడు మంజునాథ్ మరొక ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు హత్య మరియు అనుమానాస్పద మృతిగా కేసులు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# మహిళల ప్రాతినిధ్యం పెరిగితే అభివృద్ధి సాధ్యం

మహబూబ్ నగర్, : మహిళల ప్రతినిధ్యం పెరిగితే అ భివృద్ధి సాధ్యమని ఎంపీ డీకే అరుణ అన్నారు. నారీ శక్తి వందన్ అధిని యం (చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్) బిల్లుకు మద్దతుగా మహబూబ్ నగర్ పట్టణం కేంద్రంలోని ఎంపీ డీకే అరు ణ పాదయాత్రగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ చౌరస్తా లో మహి ళలతో కలసి ఎంపీ డీకే అరుణ. బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ 2029 సార్వతిక ఎన్నికల్లో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని చట్టం చేయబోతున్నారన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలలో ప్రతి ఒక్క పార్టీ సభ్యులు పాల్గొని ఈ బిల్లుకు మద్దతుగా నిలవాలని వారిని విజ్ఞప్తి చేస్తున్నాని పేర్కొన్నారు. లింగ వివక్షత ఉండవద్దు.. మహిళలు రాజకీయాల్లో రా ణించే శక్తి.. పాలించే శక్తి మహిళలకు ఉం దన్నారు.ఝాన్సీ లక్ష్మీ బాయి,రాణి రుద్రమ దేవి పోరాట పటిమ చూపిన వీర వనితలు ఉన్నారని పేర్కొన్నారు నారీ శక్తి కి బాధ్యత ఇస్తేనే వికాసిత్ భారత్ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.భారతదేశ పరిపాలనలో మహిళల భాగస్వామ్యం ఇవ్వాలని, మహి ళలు రాజకీయాల్లోకి వస్తె..తమ కుర్చీలు, ప్రాధాన్యత పోతుందని మహిళా బిల్లును అడ్డుకునే ప్రయత్నం చేసి.. గతంలో వ్యతి రేకించారని, 2029లో మహిళా రిజర్వేషన్ 33శాతం అమలు చేయాలని ప్రధాని నరేం ద్ర మోదీ కంకణం కట్టుకొని పని చేస్తు న్నారన్నారు.మహిళా బిల్లుకు మద్దతు తెలుపుతూ 966 717 3333 నంబర్ కి మి స్డ్ కాల్ ఇవ్వాలని, తెలంగాణలో 60 నూ తన అసెంబ్లీ స్థానాలు పెరిగితే.. 60 మంది మహిళాలు ఎమ్మెల్యేలు అవుతారన్నారు. అసెంబ్లీ,పార్లమెంట్ లలో మహిళల ప్రతిని ధ్యం పెరిగితే.. మహిళల అభివృద్ధి,రక్షణ, మహిళా సమస్యలపై గొంతు విప్పి అవకా శం వస్తుందని,అవినీతి రహిత పాలన మహి ళతోనే సాధ్యం అవుతుందన్నారు. అన్ని రంగాలలో మహిళలను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా బలోపేతం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

# క్రీడలు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయి

గద్వాల : క్రీడలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకే కాక అందరిలో స్నేహ సంబంధాలను పెంపొందించడానికి దోహదపడతాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఎస్జిటియు (సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్) జోగులాంబ గద్వాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు గద్వాల ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన టిపిఎల్ (టీచర్స్ ప్రీమియం లీగ్) క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతలకు మంగళవారం నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు మొదటిసారి ఈ క్రీడల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని, తాము నేర్చుకున్న క్రీడా నైపుణ్యాలను తమ పాఠశాలలోని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. 200 మంది క్రీడాకారులకు 12 టీములుగా క్రికెట్ మ్యాచ్ లను సమర్థవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.అనంతరం క్రికెట్ పోటీల విజేతగా నిలిచిన గట్టు గేమర్స్ జట్టుకు రూ. 20 వేల చెక్కు, రన్నర్స్ గా నిలిచిన గద్వాల గ్లాడియేటర్స్ జట్టుకు రూ.15 వేల చెక్కు తో పాటు పతకాలు, ట్రోఫీలను కలెక్టర్ అందజేశారు. వివిధ విభాగాల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు కూడా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఈవో విజయలక్ష్మి, ఇన్చార్జి డి వై ఎస్ ఓ రామలింగేశ్వర్ గౌడ్, వివిధ మండలాల విద్యాధికారులు, ఇతర అధికారులు, ఎస్జిటియు నేతలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మంథని, : రాష్ట్రంలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. శివకిరణ్ గార్డెన్స్‌లో మున్సిపల్ పరిధిలో 130 మంది, వివిధ గ్రామాలకు చెందిన 350 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను, 129 మంది లబ్ధిదా రులకు కల్యాణలక్ష్మి చెక్కులను, 169 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను, 160 మంది అంగన్‌వాడి టీచర్లకు సెల్‌ఫోన్‌లను, గ్యాస్ స్టవ్ లను మంగళవారం మంత్రి శ్రీధర్‌బాబు పంపిణీ చేశారు. జేబీఎస్ పాఠశా లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవటానికి తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతులకు ప్రాధాన్యతను ఇస్తూ ముందుకు సాగుతుందన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ సహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా.. ధాన్యం కొనుగోలు చేయాలి



తిప్పర్తి, : కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యాన్ని సీరియల్ ప్రకారం కొనుగోలు చేసి లారీల ద్వారా మిల్లులకు పంపించాలన్నారు.ఎక్కడా సమ స్య రాకుండా చూడాలన్నారు. ఈ యాసంగిలో ధాన్యం కొనుగోలుకు గానూ జిల్లాలో 426 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఇప్పటివరకు 286 కేం ద్రాలు ప్రారంభించామన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలన్నారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కేం ద్రాల్లో తూకం, తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు ఏర్పాటు చేశామన్నారు.ధాన్యం అన్‌లోడ్ చేసే విషయం లో ఇబ్బందులు సృష్టించకుండా మిల్లర్లతో మాట్లాడమన్నారు. రైతులకు మిల్లుల్లో ఎలాంటి ఇబ్బంది రాకుండా ఒక అధికారిని నియమించామన్నారు. సాంకేతిక సిబ్బంది కూడా అందుబాటులో ఉంటారని, ఎక్కడైనా ధాన్యంలో తూకం, తాలు, తరుగు వంటి సమస్యలు వస్తే ఈ బృందం తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరిస్తుందన్నారు. అనంతరం కలెక్టర్ తిప్పర్తిలోని డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# అమెరికా- ఇరాన్ యుద్ధానికి త్వరలోనే ముగింపు



న్యూఢిల్లీ:ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధం త్వరలోనే ముగుస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ప్రస్తుతం పరిస్థితులను పరిశీలిస్తే యుద్ధం దాదాపు ముగిసినట్టే కనిపిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఇంకా పూర్తి స్థాయి పరిష్కారం కోసం చర్చలు కొనసాగాల్సి ఉందని స్పష్టం చేశారు. ఓ ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ రాజధాని టెహ్రాన్ తమతో ఒప్పందం కుదుర్చుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. వాళ్లు ఒప్పందం చేసుకోవాలని చాలా ఆసక్తిగా ఉన్నారని ఆయన అన్నారు.ఇక అమెరికా చేపట్టిన సైనిక చర్యలపై మాట్లాడుతూ, తమ దాడులు ఇరాన్‌పై తీవ్ర ప్రభావం చూపాయని తెలిపారు. ముఖ్యంగా ఇజ్రాయెల్?తో కలిసి చేసిన ఆపరేషన్ల వల్ల ఇరాన్‌లో మౌలిక వసతులకు భారీ నష్టం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం అక్కడి పరిస్థితులు చూస్తే పునర్నిర్మాణానికి దాదాపు 20 ఏళ్లు పట్టవచ్చని ఆయన అంచనా వేశారు. ట్రంప్ వ్యాఖ్యల ప్రకారం, అమెరికా జోక్యం లేకపోతే ఇరాన్ ఇప్పటికే అణ్వాయుధాలను సిద్ధం చేసుకునేదని ఆరోపించారు."మేము ఆపకపోతే ఇప్పుడు వాళ్ల దగ్గర అణ్వాయుధం ఉండేది. అప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయేది" అని ఆయన తెలిపారు. ఇదే సందర్భంలో జర్నలిస్టును ఉద్దేశించి మాట్లాడుతూ, "వాళ్ల వద్ద అణ్వాయుధం ఉంటే మీరు వాళ్లను సర్ అని పిలవాల్సి వచ్చేది" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ఇక యుద్ధ పరిస్థితుల మధ్య దౌత్య చర్చలు కూడా కొనసాగుతున్నాయి. మొదటి విడత చర్చలు స్పష్టమైన ఫలితాలు ఇవ్వకపోయినా, రెండో విడత చర్చలపై ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ చర్చలకు వేదికగా ఇస్లామాబాద్ పేరు ముందుకు వస్తోంది. అమెరికా తరఫున ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలో బృందం పాల్గొనే అవకాశముందని సమాచారం.అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ కూడా ఈ చర్చల్లో భాగం కావచ్చని వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఇరాన్ ప్రతినిధులతో పలు గంటలపాటు చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ చర్చల ద్వారా తుది ఒప్పందానికి దారి తీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఇప్పటికీ రెండో విడత చర్చలపై తుది నిర్ణయం తీసుకోలేదని అమెరికా అధికార వర్గాలు చెబుతున్నాయి. "భవిష్యత్ చర్చలపై చర్చలు కొనసాగుతున్నాయి. కానీ ఇంకా తేదీలు ఖరారు కాలేదు" అని ఒక అధికారి వెల్లడించారు.ఇక మరోవైపు యుద్ధం పూర్తిగా ముగిసే దశలో ఉందన్న ట్రంప్ వ్యాఖ్యలతో పాటు, అమెరికా ఇంకా తన సైనిక చర్యలను పూర్తిగా నిలిపివేయలేదని కూడా స్పష్టం చేశారు. "మేము ఇంకా పూర్తిగా వెనక్కి తగ్గలేదు. పరిస్థితులను బట్టి ముందడుగు వేస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం హర్మూజ్ జలసంధిలో అమెరికా నౌకాదళం అమలు చేస్తున్న నౌకా నిర్బంధం కూడా ఉద్రిక్తతలకు కారణమవుతోంది. ఈ చర్యల వల్ల ఇరాన్‌కు చెందిన నౌకల రాకపోకలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఇప్పటికే పలువురు నౌకలు తిరిగి వెనుదిరిగినట్లు సమాచారం.ఫిబ్రవరి చివర్లో అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై సైనిక చర్యలు ప్రారంభించాయి. ఇరాన్ అణు కార్యక్రమాలపై అనుమానాల నేపథ్యంలో ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా పేర్కొంది. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన కీలక మౌలిక వసతులు ధ్వంసమయ్యాయి. అయితే ఇరాన్ కూడా తీవ్ర ప్రతీకారం తీర్చుకుంటూ అమెరికా ప్రయోజనాలపై దాడులు చేసింది. దీంతో పశ్చిమ ఆసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఈ పరిణామాలను ట్రంప్ స్వయంగా అనూహ్యమైన ప్రతిస్పందనగా పేర్కొన్నారు.ఇప్పటికైతే యుద్ధ విరమణ కొనసాగుతున్నప్పటికీ, ఏప్రిల్ 22 తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందన్నది అనిశ్చితంగా మారింది. రెండు దేశాలు తదుపరి చర్యలపై స్పష్టత ఇవ్వకపోవడంతో అంతర్జాతీయంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. మొత్తంగా చూస్తే, యుద్ధం ముగిసే దశలో ఉందన్న సంకేతాలు కనిపిస్తున్నప్పటికీ, పూర్తి స్థాయి శాంతి ఒప్పందం ఇంకా దూరంలోనే ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. తదుపరి చర్చలు, రాజకీయ నిర్ణయాలపై ఈ పరిస్థితి ఆధారపడి ఉందని అంటున్నారు.

# దర్యాప్తు ప్రాథమిక దశలో విచారణ రద్దు చేయలేరు




న్యూఢిల్లీ, : దర్యాప్తు ప్రాథమిక దశలో హైకోర్టుల జోక్యం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రాథమికంగా నేరం జరిగినట్లుగా ఫిర్యాదులో ఆధారాలు ఉన్నప్పుడు.. మెజిస్ట్రేట్ ఆదేశించిన పోలీసు దర్యాప్తును ఆదిలోనే హైకోర్టులు రద్దు చేయడం సరికాదంటూ కీలక వ్యాఖ్యలు చేసింది. నిందితులు సమర్పించే రక్షణ సాక్ష్యాలను(డిఫెన్స్ ఎవిడెన్స్) పరిగణనలోకి తీసుకుని విచారణను అడ్డుకోవడం చెల్లదని పేర్కొంది. ఈ మేరకు కర్ణాటక హైకోర్టు ఇచ్చిన ఓ కేసు రద్దు ఉత్తర్వులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. మళ్లీ మొదటి నుంచి దర్యాప్తు నిర్వహించాలని ఆదేశించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. "నిందితులు సమర్పించిన పత్రాలు, సేల్ డీడ్లను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించడం దర్యాప్తు సంస్థల పని. లేదంటే కోర్టు విచారణ సమయంలో జరగాలి. అంతకంటే ముందే హైకోర్టులు వాటిని ప్రామాణికంగా తీసుకుని కేసును కొట్టివేయడం చట్టవిరుద్ధం" అని ధర్మాసనం అభిప్రాయపడింది. కేసు సివిల్ వివాదమే కదా? అని క్రిమినల్ దర్యాప్తును ఆపలేమంది.

# రోడ్డు భద్రత చర్యలు పాటించాలి



మహబూబాబాద్, : అరైవ్ అలైవ్ 2026 కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గూడూరు మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు హెల్మెట్లు ధరించి ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్135వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు కలిసి రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలనే ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ వంటి భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఇంటినుంచి బయటకు వెళ్లే ప్రతి వ్యక్తి తన కుటుంబ సభ్యుల గురించి ఆలోచిస్తూ జాగ్రత్తగా వాహనం నడపాలని, ట్రాఫిక్ పోలీసులు ఉన్నా లేకపోయినా నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో మహబూబాబాద్ డిఎస్పీ తిరుపతిరావు, డిఎస్పీ అడ్మిన్ గంద్రతి మోహన్,గూడూరు సీఐ విజయ్ కుమార్, ఎస్.ఐ గిరిధర్, స్థానిక సర్పంచ్, ఉపసర్పంచ్, ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించాలి

సిరిసిల్ల : వేసవి కాలంలో అధికంగా సంభవించే అగ్నిప్ర మాదాలపై ప్రజల కు అవగాహన కల్పించి అగ్నిప్రమా దాలను నివారించా లని కలెక్టర్ గరిమ అగ్రవాల్ కోరారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అగ్నిమాపక వారోత్సవాల కు సంబంధించిన కరపత్రాలను ఆ శాఖ అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ అగ్నిమాపక దళ సిబ్బంది స్మారకార్థం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీ నుంచి 20తేదీ వరకు దేశవ్యాప్తంగా అగ్నిమాపక దళ వారోత్సవాలు నిర్వ హించనున్నట్లు తెలిపారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తీసుకో వాల్సిన జాగ్రత్తలపై ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయ డం వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్‌లు, గ్యాస్‌నిల్వల గోదాములు, పెట్రోల్ బంక్‌లు, సినిమా హాళ్లు, పరిశ్రమలకు వెళ్లి అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణ, అగ్నిప్రమాదాలు తగ్గించడం ప్రధాన ఉద్దేశ్యమని స్పష్టం చేశా రు. అగ్నిమాపక పరికరాల వినియోగం, మంటలను అదుపులోకి తీసుకవ చ్చి భవనాల నుంచి ఎలా బయటికి



రావడం, పొగనిండిన గదుల్లో నుంచి బయటపడడంపై తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్‌వో నరేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

## దశల వారిగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తా

బోథ్,: సోనాల మండలంలోని ఘనపూర్ గ్రామాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బోత్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేంద్ర పేర్కొన్నారు గ్రామస్తుల కోరిక మేరకు గ్రామాన్ని సందర్శించి గ్రామ సర్పంచ్ మడవి రమాదేవి ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు గ్రామ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు డిసిసి కార్యదర్శులు లోలపు పోశెట్టి హరి సింగ్ నాయకులు నరేందర్ ఎండి సద్దాం మునేశ్వర్ సోమన్న బాసెట్టి సుదర్శన్ భోజరాజు తదితరులున్నారు

## సంపూర్ణత అభి యాన్ 2.0 లక్ష్యాలను సాధించాలి

ఆసిఫాబాద్, : నీతి ఆయో గ్ కార్యక్రమాల్లో భాగంగా సంపూర్ణత అభియాన్ లక్ష్యానికి అనుగుణంగా లక్ష్యాల సాధనకు అధికారులు సమన్వయంతో పని చేయాలని నీతి ఆయోగ్ కేంద్ర ప్రభారి రజత్ సైని సూచించారు. సమీకృ త కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో జిల్లాలోని నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా సంపూర్ణత అభియాన్ 2.0లో అమలువుతున్న పనుల లక్ష్యాల సాధనపై నిర్వహించిన సమీక్షా సమావేశానికి కలెక్టర్ కె హరిత, అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి కేంద్ర ప్రభారి రజత్ సైని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి, ఫిబ్రవరి, మార్చి మూడు నెలల లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. తిర్యాణి బ్లాక్, జిల్లా బ్లాక్‌ల కోసం ప్రణాళిక రూ పొందించాలన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించే మార్పులు తీసుకు రా వాలన్నారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సరైన చికిత్సలు అందించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్యం, పారిశుధ్యం, పోషణ దినోత్సవ కార్యక్రమా లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్ నిర్మాణాలను 100 శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో పశువులకు టీకాలు అందించే కార్యక్రమం పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో బాలికలకు ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణా లు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం వినియో గంలోకి తీసుకు రావాలన్నారు. నీతి ఆయోగ్ కార్యక్ర మంలో భాగంగా తిర్యాణి బ్లాక్, జిల్లా బ్లాక్‌లలో మౌలిక వసతుల కల్పనలో అధికారులు సమష్టిగా పనిచేసి బ్లాక్, జిల్లా లక్ష్యాల సాధనకు కృషి చేయాల ని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో సంపూర్ణత అభియాన్‌లో భాగంగా కలెక్టర్ హరిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సుబోద్‌కుమార్, జీజేహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి అంబులెన్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, జిల్లా సమన్వయకర్త బాలరాజు పాల్గొన్నారు.

# విదేశాల్లో ఉద్యోగాల పేరుతో భారీ మోసం..





హైద్రాబాద్: ఉద్యోగాలు లేక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే వీరి నిరుద్యోగమే కొందరికి ఆదాయ మార్గంగా మారుతోంది. డబ్బులు తీసుకుని.. ఉద్యోగులు ఇప్పిస్తామంటూ.. అమాయక ప్రజలను నిలువునా దోచుకుని వదిలేస్తున్నారు. ఇలాంటి ముఠాలు పోలీసులకు దొరికే వరకు ఇలా అమాయకులను మోసం చేస్తూనే ఉంటారు. తాజాగా హైదరాబాద్‌లో ఒక సంస్థను ఏర్పాటు చేసి.. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ.. నిరుద్యోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడుతున్న పలువురు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ట్రివియల్ చాప్టర్ అనే పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసిన కొంతమంది వ్యక్తులు.. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులకు ఆశచూపి.. భారీ దోపిడీకి పాల్పడుతుండగా జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రీస్, రొమేనియా వంటి యూరప్ దేశాల్లో భారీ జీతంతో జాబ్స్ ఇప్పిస్తామని నమ్మించి కోట్లాది రూపాయలను వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు.. విచారణ చేపట్టి ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ట్రివియల్ చాప్టర్ సౌత్ జోన్ వైస్ ప్రెసిడెంట్ లంక నిరుపమ, తెలంగాణ రీజినల్ మేనేజర్ మామిడి అరుణ్ రాజ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నిందితులు పక్కాగా ప్లాన్ చేసి నిరుద్యోగులను మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది. తొలుత ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఓవర్సీస్ ఉద్యోగాలు అంటూ యాడ్స్ ఇచ్చేవారు. విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే వారు ఆ యాడ్స్ చూసి.. ఫోన్ చేయగా వారికి మాయమాటలు చెప్పి తమ వలలో పడేసుకునేవారు. రూల్స్ ప్రకారం విదేశాల్లో ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ కోసం కావాల్సిన ఆర్‌ఏ లైసెన్స్ లేకపోయినప్పటికీ ట్రివియల్ చాప్టర్ సంస్థను ఒక పెద్ద కన్సల్టెన్సీగా ప్రచారం చేసుకున్నారు. ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.50 వేలు మొదలుకుని రూ.4 లక్షల వరకు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇక డబ్బులు ఇచ్చినవారికి ఎలాంటి అనుమానం రాకుండా వారికి నకిలీ వర్క్ ఆథరైజేషన్ లెటర్‌లను తయారు చేయించి నిందితులు ఇచ్చేవారు. అవి చూసి నిజమైనవని భావించిన నిరుద్యోగులు మిగిలిన మొత్తం కూడా చెల్లించేవారు. ఇక డబ్బు మొత్తం చేతికి అందిన తర్వాత నిందితులు వారితో మాట్లాడటం ఆపేసి.. ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి పారిపోయేవారు. దీంతో అదంతా ఫేక్ అని గుర్తించి.. డబ్బులు చెల్లించి.. చేతిలో నకిలీ ఆఫర్ లెటర్లు పట్టుకుని బాధితులు మోసపోయామని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక ఈ కేసులో మరింత మంది నిందితుల కోసం పోలీసులు స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. ప్రస్తుతం ట్రివియల్ చాప్టర్ సంస్థ ఫౌండర్, సీఈవో సహా మరో 8 మంది నిందితులు పరారీలో ఉన్నారు. ఈ సంస్థపై గతంలో కూడా కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదైనట్లు జూబ్లీహిల్స్ పోలీసుల విచారణలో తేలింది. కేసులు నమోదైనప్పటికీ.. పేరు, ఆఫీస్ అడ్రస్ మార్చేసి.. మళ్లీ అదే దందా చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇలాంటి ఫేక్ ప్రకటనలు చూసి నిరుద్యోగులు మోసపోవద్దని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూత



చెన్నూర్,: రాష్ట్రంలోని మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేయూత అందిస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్ మండల కేంద్రంలో గల మైనారిటీ ఫంక్షన్ హాల్ లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంట్రప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, అలీప్ సంస్థ సంయుక్త కార్యదర్శి కవిత రాజేష్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, రాంప్ ప్రాజెక్టు అధికారి మహమ్మద్ ఖాసీం, చెన్నూర్ మండల తహసిల్దార్ మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్ పర్సన్ పెద్దింటి పద్మ, వైస్ చైర్ పర్సన్ వినీత్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేయూత అందించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో చెన్నూర్ కు 400 కుట్టు మిషన్లను కేటాయించి మహిళలకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. అంతకుముందు చెన్నూర్ మండలం సోమనపల్లిలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈనెల 28వ తేదీ నుండి జూన్ 28వ తేదీ వరకు పాఠశాలకు సంబంధించి అన్ని పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తో కలిసి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల సముదాయం సంబంధిత పటాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమాలలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి భద్రత పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

గద్వాల ప్రతి ఒక్కరూ రహదారి భద్రతను పాటిస్తేనే సురక్షిత ప్రయాణం చేయవచ్చని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల నేపథ్యంలో గద్వాలలోని అనంత ఫంక్షన్ హాల్లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామస్థాయి రోడ్ సేఫ్టీ కమిటీలు ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని నిబంధనలను పాటిస్తూ ప్రయాణాలు చేయాలని సూచించారు. అనంతరం గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ గతుకుల రోడ్లపైనే కాకుండా జాతీయ రహదారులపై కూడా పెద్ద సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రహదారులు బాగుంటేనే వాహనదారులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోగలుగుతారన్నారు. ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు కూడా రహదారుల విషయంలో దృష్టి పెట్టి ప్రమాదాల నివారణకు తమ వంతుగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, డిఎస్పి మొగిలయ్య, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మాకు దీటుగా ఇంజనీరింగ్ ఎగుమతులు

హైదరాబాద్, : ఇప్పటివరకు ఫార్మా రంగ ఎగుమతులకు ప్రసిద్ధి చెందిన తెలంగాణ.. ప్రస్తుతం ఇంజనీరింగ్ ఎగుమతుల్లో సరికొత్త రికార్డులు నెలకొల్పుతోంది. విమాన విడి భాగాలు, రక్షణ రంగ పరికరాలు, పారిశ్రామిక యంత్రాల ఎగుమతుల్లో రాష్ట్రం గణనీయ వృద్ధిరేటు సాధించింది. 2023-24 నుంచి 2024-25 మధ్య దేశీయ ఇంజనీరింగ్ ఎగుమతుల్లో తెలంగాణ 117.9 శాతం వృద్ధితో మొదటి స్థానాన్ని సాధించిందని 'వాణిజ్య రంగంలో జాతీయ దిగుమతులు, ఎగుమతుల వార్షిక రికార్డులపై విశ్లేషణ (నిర్యత్)' అనే నివేదిక తెలిపింది. 2022-23లో 1827 మిలియన్ల డాలర్లుగా ఉన్న ఇంజనీరింగ్ ఎగుమతులు.. 2024-25 నాటికి 103 శాతం వార్షిక సమ్మిళిత వృద్ధిరేటు (సీఏజీఆర్)తో 7535 మిలియన్ డాలర్లకు చేరుకుంది. అంటే రెండేళ్లలో రాష్ట్రం నుంచి ఇంజనీరింగ్ ఎగుమతులు నాలుగు రెట్లు పెరిగాయని గణాంకాలు చెబుతున్నారు. దక్షిణాది రాష్టాల సగటు వృద్ధిరేటు 10 శాతం మాత్రమే. రాష్ట్ర ఎగుమతుల్లో ఇంజనీరింగ్ వస్తువుల వాటా 38.44 శాతంగా నమోదైంది. 2025-26తోపాటు వచ్చే పదేళ్లలో ఇదేరకమైన వృద్ధిరేటు సాధించే అవకాశాలు ఉన్నాయని పారిశ్రామిక వర్గాల కథనం. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో భారీ ఉత్పత్తులు పెరగడం వల్లే ఇంజనీరింగ్ ఎగుమతులు పెరిగాయని యూనియన్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ డైరెక్టరేట్ జనరల్ గణాంకాలు తెలిపాయి. 2023-24లో తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి అధికారం చేపట్టే నాటికి ఇంజనీరింగ్ ఉత్పత్తుల్లో 8వ స్థానంలో ఉన్న తెలంగాణ.. ప్రస్తుతం నాల్గవ అతిపెద్ద ఇంజనీరింగ్ ఎగుమతుల రాష్ట్రంగా నిలిచింది. మహారాష్ట్ర, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలకు ఇంజనీరింగ్ ఉత్పత్తుల్లో గట్టి పోటీనిస్తున్న తెలంగాణ.. భవిష్యత్తులో మరింతగా ఇంజనీరింగ్ ఉత్పత్తులు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి అడుగులు పడటంతోపాటు ఇతర రాష్ట్రాల కంటే భారీగా భూములు ఉండటంతో తెలంగాణ దూకుడు ప్రదర్శిస్తుందని పరిశ్రమ వర్గాల కథనం. హైదరాబాద్‌లో లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్, ఎయిర్‌బస్, సఫ్రాన్, జీఈ ఏవియేషన్, ప్రాట్ అండ్ విట్నీ, కాలిన్స్ ఏరోస్పేస్, హనీవెల్ వంటి అంతర్జాతీయ కంపెనీలు తమ కేంద్రాలను ఏర్పాటుచేయడం, విడి విభాగాల ఉత్పత్తులతో తెలంగాణ కీలక తయారీ రంగంగా అవతరించింది.

# తెలంగాణలో మరో స్మార్ట్ హైవే..



హైద్రాబాద్: రవాణా వ్యవస్థలో కీలకమైన జాతీయ రహదారులు ఇప్పుడు సరికొత్త సాంకేతిక సొబగులు అద్దుకుంటున్నాయి. కేవలం సిమెంట్, తారు రోడ్లకే పరిమితం కాకుండా.. ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించేలా స్మార్ట్ హైవేలుగా రూపాంతరం చెందుతున్నాయి. ఇప్పటికే ఖమ్మం-దేవరపల్లి హైవేను స్మార్ట్ హైవేగా నిర్మించగా ఇటీవల వాహనాల రాకపోలకు సైతం ప్రారంభమయ్యాయి. తాజాగా తెలంగాణలో మరో కీలక నేషనల్ హైవే ఎన్‌హెచ్ 44ను అప్‌గ్రేడ్ చేయటంపై ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు దృష్టి సారించారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల గుండా సాగే 200 కిలోమీటర్ల మేర ఉండే ఈ హైవేను స్మార్ట్ హైవేగా మారుస్తుండగా.. అందుకు సంబంధించిన పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. ఈ స్మార్ట్ హైవేలో ప్రధాన ఆకర్షణ ఏఐ ఆధారిత ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్. రహదారి పొడవునా డిజిటల్ ఆర్చిలు, హై-రిజల్యూషన్ నిఘా కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి కేవలం ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించడమే కాకుండా.. ప్రమాదాలు జరిగినప్పుడు క్షణాల్లో కంట్రోల్ రూమ్‌కు సమాచారాన్ని చేరవేస్తాయని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా లేకపోయినా నిరంతరం పనిచేసేలా హైవేపై దారి పొడవునా సోలార్ ప్యానెల్స్‌ను అమర్చడం విశేషం. హైవేలో ప్రమాదకర మూల మలుపులు, గ్రామాల వైపు వెళ్లే సర్వీస్ రోడ్ల వద్ద ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు సెన్సార్లతో కూడిన పోల్స్‌ను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులకు అవసరమైన సమాచారం కోసం గతంలో మాదిరిగా గందరగోళ పడాల్సిన అవసరం లేదు. రహదారి పొడవునా ప్రతి 10 కిలోమీటర్లకు ఒక క్యూఆర్ కోడ్ సైన్ బోర్డును ఏర్పాటు చేశారు. ప్రయాణికులు తమ ఫోన్ ద్వారా ఈ కోడ్ స్కాన్ చేయగానే.. సమీపంలోని హోటళ్లు, పెట్రోల్ పంపులు, పోలీస్ స్టేషన్లు, టాయిలెట్లు, టోల్ ప్లాజాల వివరాలు ప్రత్యక్షమవుతాయి. అత్యవసర పరిస్థితుల్లో హైవే పెట్రోలింగ్ లేదా 1033 హెల్ప్‌లైన్ నెంబర్‌ను సంప్రదించడం మరింత సులభతరం కానుంది. ఈ నిఘా వ్యవస్థ కేవలం ట్రాఫిక్ కోసమే కాకుండా.. రహదారులపై జరిగే నేరాలు, చోరీలను అరికట్టడానికి కూడా ఉపయోగపడనుంది. రహదారిపై ఎక్కడ వాహనం ఆగినా లేదా అసాధారణ కదలికలు కనిపించినా ఏఐ కెమెరాలు వెంటనే అలర్ట్ చేస్తాయి. నిరంతర కాంతిని ఇచ్చే సోలార్ లైట్ల వల్ల రాత్రి ప్రయాణాలు మరింత సురక్షితం కానున్నాయి. స్మార్ట్ హైవేల నిర్మాణం ద్వారా రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని రహదారులను ఇదే తరహాలో అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

## ప్లాస్టిక్ ప్లేట్లను వాడవద్దు

కడెం, : ప్లాస్టిక్ ప్లేట్లను వాడవద్దని స్టీల్ ప్లేట్లను వాడుకోవాలని కడెం మండలంలోని లింగాపూర్ గ్రామ సర్పంచ్ కుమ్మరి రంజిత్ కుమార్ అన్నారు. ప్లాస్టిక్ వాడకం మనిషి నిత్యజీవితంలో భాగం అయిపోయింది. అది ప్రమాదకరమని తెలిసినా వినియోగం మాత్రం తగ్గడం లేదు. అందుకు భిన్నంగా కడెం మండలం లింగాపూర్ గ్రామ సర్పంచ్ కుమ్మరి రంజిత్, వినూత్నంగా ఆలోచించి గ్రామంలో ఎలాంటి ఫంక్షన్ జరిగిన ప్లాస్టిక్ ప్లేట్లను వాడకం నిషేధించాలని అన్నారు. అందుకు గ్రామ ప్రజల సహకారంతో సుమారుగా 1000 ప్లేట్లను కొనుగోలు చేసి, గ్రామంలో ఏ ఫంక్షన్ జరిగిన ఉచితంగా గ్రామపంచాయతీ నుండి తీసుకుని వెళ్లి స్టీల్ ప్లేట్లనే ఉపయోగించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ ని వాడడం వల్ల శ్వాస కోశ సంబంధ వ్యాధులు, రోగ నిరోధక శక్తి బలహీనపడడం, కాలేయం , కిడ్నీ, మెదడు వంటి వ్యాధులు ప్రభలుతాయాని, గ్రామాన్ని పర్యావరణ రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇప్పటి నుంచి గ్రామంలో ఎవరు కూడా ప్లాస్టిక్ ప్లేట్లను వాడకూడదని అన్నారు. ఇందులో గ్రామ ఉపసర్పంచ్ కమ్మల లక్ష్మి స్వామి, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు ఉన్నారు.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State,
Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State.
Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280